

**మీకోసం**

కేకు గుడ్డు వాసన రాకుండా.. తయారు చేసేటప్పుడు రెండు చెంచాల తేనె కలపాలి.

**జీవన సౌరభం**

ఏ రోజైతే నీకు కష్టపడడం చేతకాదో.. ఆరోజు నుంచే మోసం చేయడం అలవాటు అవుతుంది.






ఎంత ధనం పోసిన
కొనలేనిది
కోటీశ్వరుడైన తలవంచేది
పోయినది తిరిగి రానిది
సమయమే అని తెలుసుకో ..

ఎక్కడ అరువు దొరకనిది
ఆస్తులు అమ్మిన వెలకట్టలేనిది
ఆవిరైన మబ్బులా తిరిగిరాదు
ఆలోచించి సత్యము కనుక్కో..

క్షణంలో జీవితం మారు
గెలుపోటములు నిర్ణయించు
వృథా చేస్తే తప్పదు పతనం
పనితనంతో ఉపయోగించుకో..

విజేతకు పరాజితుడికి ఒక్కటే
కాలములో మార్పులేదు
పని తనములోనే చేర్పులు
ఆస్వాదించే గెలుపని నమ్ముకో..

బంగారు ముక్కతో సమానం
భవిష్యత్తుకు అదే ఆధారం
ఎదుగుదలకు తోడ్పడుతుంది
జీవిత ప్రయాణం సవరించుకో..

త్యాగము చెయ్యి భోగాలను
ఖర్చు చెయ్యకు సమయమును
నిత్యం కాలముతో పరుగెత్తు
అభివృద్ధి తోడుగా ఎన్నుకో ..

- కొప్పల ప్రసాద్
నంద్యాల, 98850 66235



## చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి.
ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

## దారి చూపండి

చిన్నారులూ, బుల్లి రాకెట్ ద్వారా వేరే గ్రహం మీదకి వెలుతున్నాడు.
ఏ దారిలో వెళ్లాలో చెప్పండి.



## నేను గీసిన బొమ్మ



- వై.ఉన్నతి,
సంతన్ హైస్కూలు, గుంటూరు.






# ఆకాశంలోనే కాదు; భూగర్భ గనుల్లోనూ సగం ..

**ఈ ఇద్దరూ భూగర్భ గని నిర్వాహక స్థాయిలో నియమించబడిన మొదటి మహిళలుగా రికార్డు సృష్టించారు. ప్రపంచంలోని అతి పెద్ద జింక్-సీసం, వెండి ఉత్పత్తిదారులలో ఒకటైన ఉదయపూర్‌లోని 'హిందుస్తాన్ జింక్' కంపెనీ ఇటీవల తమ మైనింగ్ విభాగంలో ఇద్దరు మహిళలను అత్యున్నత స్థాయిలో నియమించింది. మైనింగ్ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన తెలంగాణకు చెందిన సంధ్యను భూగర్భ గని మేనేజర్‌గా, గోవాకు చెందిన యోగీశ్వరిని భూగర్భ గని అభివృద్ధి నిర్వాహకు రాలిగా నియమితులయ్యారు.**

గనుల చట్టం 1952 ప్రకారం మైనింగ్ విభాగంలో మహిళలకు ప్రవేశ అర్హత లేదు. 2019 సవరణ ద్వారా అవసరమైన 'ఫస్ట్‌క్లాస్ మైనింగ్ మేనేజర్', 'సెకండ్ క్లాస్ మైనింగ్ మేనేజర్' అనే రెండు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే మహిళలు కూడా భూగర్భ గనుల్లో పని చేయడానికి అర్హత కల్పించబడింది. ఈ సవరణ సంధ్య, యోగేశ్వరి దశను మార్చే మైలురాయిగా దోహదపడింది.

సంధ్య, యోగీశ్వరి 2018 నుంచి వేదాంత గ్రూప్ వారి హిందూస్థాన్ జింక్‌లో పనిచేస్తున్నారు. పరిమిత, అనియంత్రిత విభాగంలో 'ఫస్ట్ క్లాస్ మైన్స్ మేనేజర్' సర్టిఫికెట్ పొందిన మొదటి మహిళలు కూడా వీరే! అనియంత్రిత విభాగంలో 'సెకండ్ క్లాస్ మేనేజర్' సర్టిఫికెట్ అందుకున్న తొలి మహిళగా కూడా సంధ్య గుర్తింపు పొందింది. హిందూస్తాన్ జింక్ వారి జవర్మాలా మైన్‌కు మైన్ మేనేజర్‌గా సంధ్య, కయాద్ మైన్ హెడ్, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా యోగేశ్వరి ఎంపికయ్యారు.

తెలంగాణ భూపాలపల్లికి చెందిన సంధ్య ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు తన మేనమమాలాగ కంప్యూటర్ టెక్నాలజీలో నైపుణ్యం సాధించాలనుకుంది. కానీ ఆమెకు మైనింగ్‌లో సీటు వచ్చింది. మైనింగ్ అభివృద్ధి చెందుతున్న విభాగం అని, అవకాశాలు బాగా ఉంటాయని తన మామయ్య మార్గనిర్దేశం చేయడంతో ఆమె మైనింగ్ ఇంజనీరింగ్‌లో చేరింది.

సంధ్య తండ్రి సింగరేణిలో పనిచేస్తున్నాడు. కాబట్టి ఈ రంగంలో ముఖ్యంగా మహిళకు ఎదురయ్యే సవాళ్ల గురించి ఆమెకు బాగా తెలుసు. 2018లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన సంధ్యకు ఉదయ్‌పూర్‌లోని హిందూస్తాన్ జింక్ లిమిటెడ్‌లో ఉద్యోగం లభించింది. సంవత్సరం తర్వాత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డిజిఎంఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ నోటిఫికేషన్‌లోని సవరణతో ఫస్ట్ క్లాస్ మేనేజర్ సర్టిఫికెట్ అందుకొని, డిజిఎంఎస్ అసిస్టెంట్ మేనేజర్ కోసం దరఖాస్తు చేసుకుంది సంధ్య. కొన్ని నిబంధనలు, షరతులు ఉన్నప్పటికీ మహిళలు భూగర్భంలో పనిచేయడానికి వీలు కల్పించిన డిజిఎంఎస్‌కు ధన్యవాదాలు తెలుపుతుంది. మైనింగ్ కెరీర్‌ను ఎంచుకున్నప్పుడు అది అమ్మాయిల ఉద్యోగం కాదని అన్న వ్యక్తులే ఇప్పుడు తన విజయాన్ని చూసి ప్రశంసిస్తున్నారు.

గోవాకు చెందిన యోగేశ్వరి ... మైనింగ్‌లో నాలుగేళ్ల మల్టీ ఆపరేషనల్ అనుభవం ఉన్న యువ ఇంజనీరు. ఆమె గోవా ఇంజనీరింగ్ కాలేజీలో 2015లో మైనింగ్ ఇంజనీరింగ్ పూర్తిచేసింది. మూడేళ్లుగా హిందూస్తాన్ జింక్ కంపెనీలో విధులు నిర్వర్తిస్తూ భూగర్భ గని అభివృద్ధి నిర్వాహకురాలిగా నియమితురాలైంది.

సంధ్య, యోగేశ్వరిల నియామకంతో.. "మైనింగ్‌లో మహిళలను అనుమతించడం విప్లవాత్మక నిర్ణయం. మైనింగ్ ఇంజనీరింగ్‌ను ఎంచుకునే యువతులకు సంధ్య, యోగేశ్వరి నియామకాలు ఒక ప్రేరణగా నిలుస్తాయి." అంటారు హిందూస్తాన్ జింక్ సిఇఒ అరుణ్ మిశ్రా.

# పర్యావరణ హితంగా .. ఆరోగ్యానికి ఆలంబనగా ...

ప్రస్తుతం ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు అల్యూమినియం రేకులతో చేసిన పలుచటి పొరలను వాడుతున్నారు. కొన్ని చోట్ల ప్లాస్టిక్ బాక్సుల్లో కూడా పెట్టి ఇస్తున్నారు. ఇవి ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో హానికరమైనవి. అందుకే వీటికి ప్రత్యామ్నాయాలు కనిపెట్టారు మన శాస్త్రవేత్తలు. ఫలితంగా ఇప్పుడు సముద్రపు నాచుతో తినగలిగే సాచెట్లు రాబోతున్నాయి.

ఎర్ర సీవీడ్ (కప్పాఫికస్ అల్వారెజి), గ్రీన్ సీవీడ్ (ఉల్వా లాక్టుకా) ఉపయోగించి తినగలిగే, బయోడీగ్రేడబుల్, ఫంక్షనల్ సీవీడ్ ప్యాకెట్ల తయారీకి విశాఖపట్నంలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సిఐఎఫ్) శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయోగాలు తుది దశలో ఉన్నాయి. మనం ఉపయోగిస్తున్న సాచెట్లు భూమిలో కలిసిపో వడానికి చాలాకాలం పడుతుంది. అల్యూమిని యం ప్యాకెట్లు భూమిలో కలిసి పోవడానికి దాదాపు 6 వారాలు పడుతుంది. అదే ప్లాస్టిక్ అయితే 450 సంవత్సరాలు పడుతుంది. వీటి వల్ల భూమి విషతుల్యం అయిపో తుంది. పర్యావరణం నాశనమవు తుంది. దీని పరిష్కారం కోసం శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలుగా చేస్తున్న ప్రయోగాల ఫలితమే ఈ సీవీడ్ సాచెట్లు. ఇవి సముద్రంలో 180 మీటర్ల లోతులో పెరిగే మొక్కల్లాంటి నాచు (సీవీడ్)తో తయారు చేయబడుతున్నాయి. సంవత్సరకాలంగా సముద్రపు పాచిపై పరిశో ధనలు జరపగా... ఆహార పదార్థాల ప్యాకింగ్ కోసం తినదగిన, పర్యావరణంలో తక్కువ కాలంలోనే కలిసిపోయేవిగా మార్చవొచ్చు అని తేలింది.



ఆహార పరిశ్రమలో ఇటువంటి సాంకేతికతతో తయారు చేసిన సాచెట్లు కొత్తవేమీ కాదు. 2019 లండన్ మారథాన్‌లో మొదటిసారిగా ఇటువంటివి ఉపయోగించారు. క్రీడాకారులకు ఇచ్చే లుకోజాడే అనే డ్రింక్‌ని ఇటువంటి సాచెట్లలో సరఫరా చేశారు. వాటిని తీనేయొచ్చు లేదా వదిలేయవచ్చు. ఇటువంటి సాంకేతిక పరిజ్ఞానం భారతదేశంలో అభివృద్ధి చేయడం ఇదే మొదటిసారి.

'పలుచని సీలింగ్ చేయబడినట్లుగా ఉండే సీవీడ్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆహార పరిశ్రమలో ప్యాకేజింగ్ మెటీరియల్‌గా ఉపయోగించడానికి అనువుగా ఉంటాయి' అని విశాఖపట్నం రీసెర్చ్ సెంటర్ ఫిష్ ప్రాసెసింగ్ విభాగం శాస్త్రవేత్త జెస్మి డెబ్బర్మా తెలిపారు.

తన సహచరుల సహాయంతో గత మూడేళ్లుగా సముద్రపు నాచుపై డెబ్బర్మా పరిశోధన చేశారు. ఎర్ర, ఆకుపచ్చ సముద్రపు నాచును ఎండించి, పొడి చేసి తినదగిన సీవీడ్ రేకుగా తయారుచేశారు. నాచుకి సోడియం ఆల్జినేట్, పాలిసాచురైడ్‌ను తగిన మోతాదులో కలిపి సహజ ప్లాస్టి సాచెట్లను తయారు చేశారు. ఇవి భూమిలో సులువుగా కలిసిపోతాయి. పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదు.

ఈ సీవీడ్ సాచెట్లలో ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయని గుర్తించిన ఆమె వీటిని ఆరోగ్యవంతమైన డ్రింగ్‌లుగాను, కుకీస్‌గానూ తయారుచేశారు. వీటిలో ముఖ్యంగా కాల్షియం, రాగి, అయోడిన్, ఇనుము ఉన్నాయి. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఫోలిక్ యాసిడ్ కూడా ఉన్నాయి. ఇవి గనుక వాడకంలోకి వస్తే ఆరోగ్యానికి, పర్యావరణానికీ మేలు చేకూరినట్టే!

# 'ఆకాశవాణి'లో ఆదివాసీ పాట




రాజమౌళి శిష్యుడు అశ్విన్ గంగరాజు తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆకాశవాణి'. ఇందులో విలక్షణ నటుడు సముద్రఖని - వినయ్ వర్మ - తేజ కాకుమాను - ప్రశాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏయూ అండ్ ఐ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై ఎ.పద్మనాభరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రంలోని 'మన కోన' అనే పాట లిరికల్ వీడియోను నేచురల్ స్టార్ నాని విడుదల చేశారు. 'కొయ్యాహే కొయ్యాహే.. కొమ్మలనే అమ్మలనే కోయనై..' అంటూ సాగే ఈ గీతానికి కాల భైరవ స్వరాలు సమకూర్చారు. అడవిలో జీవించే ఆదివాసీల నేపథ్యాన్ని తెలియజేసేలా అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. మంగ్లీ - కాల భైరవ ఆలపించారు. విభిన్న కథాంశంతో రూపొందుతోన్న ఈ చిత్రానికి ప్రముఖ రచయిత సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నారు. సురేశ్ రగుతు సినిమాటోగ్రఫీ అందించారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రం త్వరలో విడుదలవ్వబోతోంది.

# ఓటీటీలో అజయ్ 'రుద్ర'



బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ 'రుద్ర : ది ఎడ్జ్ ఆఫ్ డార్క్‌నెస్' సిరీస్‌తో ఓటీటీలో అడుగుపెట్టనున్నాడు. అజయ్ ప్రధాన పాత్రలో అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, బీబీసీ స్టూడియోస్ సంస్థలు ఈ సిరీస్‌ని రూపొందిస్తున్నాయి. తన కెరీర్‌లో ఇప్పటికే ఎన్నో పోలీసు పాత్రల్ని పోషించిన అజయ్ దేవగణ్ ఈ సిరీస్‌లో మరో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనున్నారు. ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని క్రైమ్ డ్రామా నేపథ్యంలో ఈ సిరీస్ తెరకెక్కింది. త్వరలోనే డిస్నీ హాట్‌స్టార్ వీఐపీ వేదికగా విడుదల కానుంది. బ్రిటీష్ వెబ్ సిరీస్ 'లూథర్' ఆధారంగా 'రుద్ర' తెరకెక్కింది. రాజేశ్ మపుస్కర్ దర్శకుడు.

# బాఫ్టా 2021 ఇండియా జ్యూరీ అధ్యక్షుడిగా రెహమాన్



ఆస్కార్ అవార్డు గ్రహీత ఎఆర్.రెహమాన్ బాఫ్టా 2021 ఇండియా జ్యూరీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. బ్రిటీష్ అకాడెమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ (బాఫ్టా) నెట్ ఫ్లిక్స్ మద్దతుతో తొలి బాఫ్టా బ్రేక్ త్రూ ఇండియా పరిశోధక జ్యూరీ సభ్యుల జాబితాను తాజాగా ప్రకటించారు. సినిమా, స్పోర్ట్స్, టెలివిజన్ పరిశ్రమల నుండి ప్రముఖులు, నిపుణులు ఈ సంవత్సరం ఈ గౌరవాన్ని అందుకున్నారు. జ్యూరీకి బాఫ్టా బ్రేక్ త్రూ ఇండియా అంబాసిడర్ ఎఆర్ రెహమాన్ అధ్యక్షత వహించబోతున్నారు. ఈ సందర్భంగా జ్యూరీ చైర్మన్ ఎఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. బాఫ్టా ... ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న గొప్ప వేదిక. ఈ బ్రేక్ త్రూ ఇండియా జ్యూరీలో భాగం కావడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను.' అన్నారు. ఈ సందర్భంగా హానరీల తుది జాబితా వచ్చే నెలలో ప్రకటించనున్నట్టు తెలిపారు.

# మరోసారి సుధీర్‌బాబుతో ఇంద్రగంటి..



సుధీర్ బాబుతో మరో సినిమా చేస్తున్నాడు ఇంద్రగంటి మోహనకృష్ణ. ఈ చిత్రానికి 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' అనే టైటిల్‌ను నిర్ణయించారు. 'సమ్మోహనం' తరహాలో ఈ చిత్రం కూడా సినిమా నేపథ్యంలో తెరకెక్కుతోంది. డైరక్టర్‌గా చేస్తున్న ఓ వ్యక్తి కొన్ని సరదా సంఘటనలు సీరియస్ విషయానికి దారితీసి సమస్యల్లో పడేస్తే ఏం చేస్తాడు? వాటిని ఎలా తెలివిగా డీల్ చేసి సినిమా పూర్తి చేసాడన్నదే సినిమా కథ. ఇందులో హీరోయిన్‌గా కృతిశెట్టి నటిస్తోంది. బెంచ్ మార్క్ స్టూడియోస్ పతాకంపై బి.మహేంద్ర బాబు, కిరణ్ బల్లపల్లి నిర్మిస్తున్నారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, అవసరాల శ్రీనివాస్, రాహుల్ రామకృష్ణ, శ్రీకాంత్ అయ్యంగార్, కళ్యాణి నటరాజన్ ఇతర ముఖ్యపాత్రధారులు.

# సినీసీమలో కోవిడ్ విజృంభణ



సినీసీమలో కోవిడ్ ప్రకంపనలు కొనసాగుతున్నాయి. తాజాగా దర్శకుడు రమేష్ వర్మ కరోనా బారిన పడ్డారు. ఇటీవల జరిపిన పరీక్షలలో ఆయనకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉంటూ, జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా ఆయన తెలిపారు. అందరూ తప్పకుండా మాస్క్ ధరించాలని, అవసరం ఉంటే తప్ప బయటకు వెళ్లొద్దని రమేష్ వర్మ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈయన రవితేజతో చేస్తున్న 'ఖిలాడి' సినిమా సెకండ్ వేవ్ కారణంగా వాయిదా పడింది. అలాగే బాలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు శ్రావణ్ (66) కరోనాతో 'క్లిష్టమైన' స్థితిలో చికిత్స పొందుతున్నారు. దిగ్గజ సంగీత దర్శకుల ద్వయంలో ఒకరైన శ్రావణ్ రాథోడ్‌కు (నదీమ్- శ్రావణ్ ) ఇటీవల కరోనా సోకింది. ప్రస్తుతం ముంబైలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని ఆయన కుమారుడు, మ్యూజిక్ కంపోజర్ సంజీవ్ రాథోడ్ తెలిపారు.

# మిశ్రా మ్యాజిక్


మిశ్రా 4/24

## ముంబయి 137పరుగులకే కట్టడి

**చెన్నై :** ఢిల్లీ స్పిన్నర్ అమిత్ మిశ్రా(4/24), యువ పేసర్ ఆవేశ్ ఖాన్(2/15) బౌలింగ్‌లో చేలరేగడంతో ముంబయి నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైంది. ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)లో భాగంగా మంగళవారం జరిగిన పోటీలో తొలుత కెప్టెన్ రోహిత్ శర్మ 30 బంతుల్లో 44 పరుగులు చేసినా.. మిగతా బ్యాట్స్‌మన్లు నిరాశపర్చడంతో ముంబయి జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులకే పరిమితమైంది. సూర్యకుమార్(24), ఇషన్(26) మాత్రమే రాణించగా.. హార్దిక్, పొలార్డ్, డికాక్, కృనాల్ ఘోరంగా విఫలమయ్యారు.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ముంబయికి శుభారంభం దక్కలేదు. ఓపెనర్ క్వింటన్ డికాక్(1).. స్టొయినీస్ ఓవర్ తొలి బంతికే రిషబ్ పంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత రోహిత్-సూర్యకుమార్ యాదవ్ కలిసి రెండో వికెట్‌కు 58 పరుగులు జతచేశారు. అశ్విన్ వేసిన నాలుగో ఓవర్లో యాదవ్ ఒక ఫోర్ కొట్టగా.. రోహిత్ ఫోర్, సిక్సర్ బాదడంతో ఆ ఓవర్లో 15 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత రబాడ బౌలింగ్‌లోనూ 14 పరుగులు రాబట్టారు. దీంతో పవర్‌ప్లే 6 ఓవర్లు ముగిసే సరికి ముంబయి వికెట్ నష్టానికి 55 పరుగులు చేసింది. క్రీజ్‌లో రోహిత్ దూకుడుగా ఆడుతుండటంతో ముంబయి భారీ స్కోరు చేసేలా కనిపించింది. ఈ దశలో సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న మిశ్రా మణికట్టు మాయాజాలాన్ని ప్రదర్శించి ముంబయిని దెబ్బకొట్టాడు. 9వ ఓవర్లో రోహిత్, హార్దిక్ పాండ్యను మిశ్రా ఔట్ చేశాడు. ఆ తర్వాత స్టార్ బ్యాట్స్‌మన్ పొలార్డ్‌ను ఎల్‌బిగా ఔట్ చేయడంతో ముంబయి ఒక్కసారిగా తడబడింది. స్పిన్నర్లు టాప్, మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ ఆట కట్టించారు. చివర్లో నిలకడగా ఆడుతున్న ఇషాన్‌ను మిశ్రా పెవిలియన్ పంపాడు. ఢిల్లీ బౌలర్లలో ఆవేశ్ ఖాన్ రెండు వికెట్లు తీయగా స్టొయినీస్, రబాడ, లలిత్ యాదవ్ తలో వికెట్ తీశారు.

**స్కోర్‌బోర్డు..**

**ముంబయి ఇండియన్స్ :** రోహిత్ (సి)స్మిత్ (బి)మిశ్రా 44, డికాక్ (సి)పంత్ (బి)స్టోయినీస్ 1, సూర్యకుమార్ (సి)పంత్ (బి)ఆవేశ్ ఖాన్ 24, ఇషన్ కిషన్ (బి)మిశ్రా 26, హార్దిక్ (సి)స్మిత్ (బి)మిశ్రా 0, కృనాల్ పాండ్యా (బి)లలిత్ యాదవ్ 1, పొలార్డ్ (ఎల్‌బి)మిశ్రా 2, జయంత్ యాదవ్ (సి అండ్ బి) రబాడ 23, రాహుల్ చాహర్ (సి)పంత్ (బి)ఆవేశ్ ఖాన్ 6, బుమ్రా (నాటౌట్) 3, బౌల్ట్ (నాటౌట్) 1, అదనం 6. (20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి) 137 పరుగులు.

**వికెట్ల పతనం :** 1/9, 2/67, 3/76, 4/77, 5/81, 6/84, 7/123, 8/129, 9/135

**బౌలింగ్ :** స్టొయినీస్ 3-0-20-1, అశ్విన్ 4-0-30-0, రబాడ 3-0-25-1, మిశ్రా 4-0-24-4, ఆవేశ్ ఖాన్ 2-0-15-2, లలిత్ యాదవ్ 4-0-17-1.

**పాయింట్ల పట్టిక**

| ఫ్రాంచైజీ | ఆ | గె | ఓ | పా | నె.ర. |
|---|---|---|---|---|---|
| బెంగళూరు | 3 | 3 | 0 | 6 | +0.750 |
| చెన్నై | 3 | 2 | 1 | 4 | +1.194 |
| ఢిల్లీ | 3 | 2 | 1 | 4 | +0.453 |
| ముంబయి | 3 | 2 | 1 | 4 | +0.367 |
| కోల్‌కతా | 3 | 1 | 2 | 2 | +0.633 |
| రాజస్తాన్ | 3 | 1 | 2 | 2 | +0.719 |
| పంజాబ్ | 3 | 1 | 2 | 2 | -0.967 |
| హైదరాబాద్ | 3 | 0 | 3 | 0 | -0.483 |

నోట్: ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు, నె.ర.:నెట్ రన్‌రేట్,

**ఐపిఎల్‌లో నేడు**


పంజాబ్ X హైదరాబాద్

సమయం: రా. 3.30 వేదిక: చెన్నై


కోల్‌కత్తా X చెన్నై

సమయం: రా. 7.30 వేదిక: ముంబయి

# షెడ్యూల్ ప్రకారమే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్స్: ఐసిసి




**దుబాయ్:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యుటిసి) ఫైనల్ సౌథాంప్టన్ వేదికగా జూన్ 18- 22 మధ్య జరుగుతుందని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) మంగళవారం స్పష్టం చేసింది. భారత్‌లో కరోనా తీవ్ర స్థాయిలో ఉండటంతో ఇండియా నుంచి రాకపోకలపై బ్రిటీష్ ప్రభుత్వం నిషేధం విధిస్తూ 'రెడ్ లిస్ట్'లో చేర్చింది. అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లను సురక్షిత వాతావరణంలో ఎలా నిర్వహించాలో ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసిబి) ఇప్పటికే నిరూపించాయని, డబ్ల్యుటిసి ఫైనల్ ఎలాంటి అవాంతరాలు లేకుండా జరుగుతుందని ఐసిసి ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్స్ భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న సంగతి తెలిసిందే. ఇండియన్ ప్రిమియర్‌లీగ్(ఐపిఎల్)లో ఇరుజట్ల ఆటగాళ్ళు ఉండగా.. మే 30తో ఐపిఎల్ ముగియనుంది. అనంతరం భారత్- న్యూజిలాండ్ ఆటగాళ్ళు జూన్ 2న లార్డ్‌కు వెళ్లి 10రోజులు క్వారంటైన్‌లో ఉండాల్సి ఉంటుంది.

**ఇ-వేలం - కాంకస్ట్ స్టీల్ & పవర్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్)**
ఇన్‌సాల్వేన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద ఆస్తుల విక్రయం

లిక్విడేటర్ ద్వారా ఏర్పాటుకాబడిన లిక్విడేషన్ ఎస్టేట్ ఏర్పాటు భాగంగా కాంకస్ట్ స్టీల్ & పవర్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్) ద్వారా సొంతమైన అస్సెట్స్ మరియు ఆస్తుల విక్రయం, హానరబుల్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, కోల్‌కత బెంచ్ వైడ్ ఆర్డర్ 26 సెప్టెంబర్ 2018 తేదిన నియమించబడింది.
ఆసక్తిగల అభ్యర్థులు వివరణాత్మక EOI ప్రాసెస్ డాక్యుమెంట్ మరియు అస్సెట్ విక్రయం ప్రాసెస్ మెమొరిండం కార్పోరేట్ డెబ్టార్ వెబ్‌సైట్ https://concastispat.com/nclt.html మరియు ఇ-వేలం వెబ్‌సైట్ https://ncltauction.auctiontiger.net మీద అప్‌లోడ్ చేయబడింది.
వేలం విక్రయం ఇ-వేలం ప్లాట్‌ఫారం (ప్రతి 15 నిమిషాలు అపరిమిత పొడగింపు) https://ncltauction.auctiontiger.net ద్వారా జరుగును.

| అస్సెట్ లాట్ | విక్రయం పద్ధతి | తనిఖీ తేది | వేలం తేది మరియు సమయం | రిజర్వ్ ధర (ఐఎన్ఆర్) | బయానా మొత్తం & దాఖలకు గడువు |
|---|---|---|---|---|---|
| అస్సెట్ లాట్ నం.2 సొడెపూర్ యూనిట్ 2- భాగం & భవనం | స్వతంత్ర పద్ధతి | ఏప్రిల్ 30, 2021 లోపు | మే 4, 2021 ఉ. 11:01 గం.ల నుండి మే 4, 2021 సా. 18:00 వరకు | 10.32 కోట్లు | 1 కోటి లేదా ఏప్రిల్ 30, 2021 లోపు |
| అస్సెట్ లాట్ నం.3 శ్రీకాకుళం యూనిట్ | స్వతంత్ర పద్ధతి | ఏప్రిల్ 30, 2021 లోపు | మే 4, 2021 ఉ. 11:01 గం.ల నుండి మే 4, 2021 సా. 18:00 వరకు | 72.74 కోట్లు | 7.25 కోట్లు లేదా ఏప్రిల్ 30, 2021 లోపు |
| అస్సెట్ లాట్ నం.8- వాహనాలు | పార్శిల్/ యూనిట్ | ఏప్రిల్ 30, 2021 లోపు | మే 4, 2021 ఉ. 11:01 గం.ల నుండి మే 4, 2021 సా. 18:00 వరకు | 20.84 లక్షలు | 2.10 లక్షలు లేదా ఏప్రిల్ 30, 2021 లోపు |

ఇ-వేలానికి సంబంధించి ఏదైనా సమాచారం కొరకు, సంప్రదించుటకు: శ్రీ సప్తరిషి బైద్య/శ్రీ నవ్‌నిత్ కుమార్ +91 98360 70992/79035 75095. ఇమెయిల్: LQ.Concast@in.gt.com

క్షితిజ్ చవచ్చరియా
లిక్విడేటర్ ఆఫ్ కాంకస్ట్ స్టీల్ & పవర్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్)
ఐబిబిఐ రిజిస్ట్రేషన్ నం-ఐబిబిఐ/ఐపిఎ-001/ఐపి-పి00358/2017-18/10616
నమోదిత చిరునామా:
C/O బి. చవచ్చరియా & కో
8ఎ & బి, సత్యం టవర్ 3, అలిపోర్ రోడ్, కోల్‌కత-700027
ఇమెయిల్: Kshitiz@bccoindia.com
ప్రదేశం: కోల్‌కత
తేది: ఏప్రిల్ 21, 2021

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram - 515004, A.P State, Ph.08554 -2577248,
and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram-515004, Editor : Mallajosyula Venkata Subrahmanya Sarma, Ph.0866-2577248, email: editorprajasakthi@gmail.com, RNI Regd .No. APTEL/2019/78422